నేడు ఎచ్చెర్లలో సామాజిక సాధికార యాత్ర

ఎచ్చెర్ల, నరసన్నపేట : వైసిపి ఆధ్వర్యాన చేపడుతున్న సామాజిక సాధికార యాత్రను ఈనెల 27వ తేదీన ఎచ్చెర్ల మండలం చిలకపాలెంలో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఈ బస్సు యాత్రను విజయవంతం చేయాలని నియోజకవర్గ ప్రజలకు, పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రణస్థలం మండలం పైడిభీమవరంలోని మహి గ్రాండ్‌లో పలువురు మంత్రులు విలేకరుల సమావేశంలో పాల్గొంటారని తెలిపారు. అనంతరం ఎచ్చెర్ల నియోజకవర్గంలోని విశ్రాంత ఉద్యోగులతో ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. అక్కడ్నుంచి ఎచ్చెర్ల మండలం చిలకపాలెం కూడలికి చేరుకుని అక్కడ బహిరంగ సభలో పాల్గొంటారని వివరించారు. ఈ సభలో పలువురు మంత్రులు, వైసిపి ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొంటారని తెలిపారు.

పత్తి కొనుగోలు ఎప్పుడు?

- ఉమ్మడి జిల్లాలో రాజాంలో కొనుగోలు
- జిల్లా పునర్విభజన తర్వాత జిల్లాలో ఏర్పాటు కాని కేంద్రం
- ఎచ్చెర్లలో ఏర్పాటుకు అధికారుల ప్రతిప్రాదనలు
- ఇంకా తేల్చని ప్రభుత్వం

ఆరుగాలం కష్టించి పండిన పత్తి పంట దళారుల పాలవుతోంది. ప్రతి ఏడాది మాదిరిగానే ఈ సంవత్సరం కూడా పత్తి రైతుకు మద్దతు ధర దక్కడం లేదు. జిల్లాలో పత్తి కొనుగోలు చేయకపోవడమే ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ఉమ్మడి జిల్లాలో రాజాంలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఏటా పత్తి కొనుగోలు చేసేది. జిల్లాల పునర్విభజన తర్వాత రాజాం విజయనగరం జిల్లాలో చేరడంతో, జిల్లాలో కొనుగోలు కేంద్రమే లేకుండా పోయింది. జిల్లాకు సంబంధించి ఎచ్చెర్లలో కేంద్రం ఏర్పాటుకు మార్కెటింగ్ శాఖ అధికారులు ఈ ఏడాది ఆగస్టులో ప్రతిపాదనలు పంపినా, ఇప్పటివరకు ఆమోదం తెలపలేదు. ఇదే అదనుగా వ్యాపారులు, దళారులు గ్రామాల్లోకి వెళ్లి రైతుల నుంచి తక్కువ ధరకే కొనుగోలు చేస్తూ దోపిడీకి పాల్పడుతున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, లావేరు

పత్తి ఏరుతున్న రైతులు

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 2,763 ఎకరాల్లో పత్తి సాగు అయింది. వర్షాభావ పరిస్థితుల వల్ల సాగు బాగా తగ్గిపోయింది. ఈ ఏడాది 4,620 ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేస్తారని అంచనా వేశారు. పంట సాగు తగ్గినా, దిగుబడి పర్వాలేదని రైతులు చెప్తున్నారు. సుమారు 30 వేల క్వింటాళ్ల వరకు పత్తి పంట దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రభుత్వం పత్తి పంట మొదటి రకానికి (పొడుగు గింజ పత్తి) క్వింటాకు రూ.7020, రెండో రకం (పొట్టిగింజ)కు రూ.6,625 ప్రకటించింది. మద్దతు ధర ప్రకటన కాగితాలకే పరిమితమైంది. రైతులకు ప్రభుత్వం ప్రకటించిన ధర దక్కడం లేదు. ప్రభుత్వపరంగా కొనుగోలు చేయకపోవడమే ప్రధాన కారణమన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఈ సీజన్‌లో ప్రతి ఏడాది రాజాంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసేవారు. కష్టమో, నష్టమో అక్కడకు వెళ్లి రైతులు తమ పంటను అమ్ముకునేవారు. ప్రభుత్వం కొనుగోలు చేస్తుండడంతో అటు వ్యాపారులు, దళారులూ ప్రభుత్వం కంటే కాస్త ఎక్కువ ధరే చెల్లించిన పరిస్థితి ఉండేది. గతేడాది క్వింటా పత్తికి రూ.7,500 నుంచి రూ.8 వేల వరకు పలికేది. ప్రస్తుతం రూ.ఆరు వేలకు మించి వ్యాపారులు కొనడం లేదని రైతులు చెప్తున్నారు.

పంట అమ్ముకుందామంటే ధర లేదు

ఈ ఏడాది ఎకరాన్నర భూమిలో పత్తి వేశాం. అప్పు చేసి రూ.30 వేల వరకు మదుపులు పెట్టాను. పంట అమ్ముకుందామంటే ధర లేదు. గతేడాది బహిరంగ మార్కెట్‌లో రూ.7,500 వచ్చింది. ఇప్పుడు రూ.ఆరు వేలే ఇస్తామంటున్నారు. ప్రభుత్వం కొంటే కొంత ఎక్కువ ధర వచ్చేది. వాతావరణం బాగాలేదు. పంటను ఎన్నాళ్లు ఇంట్లో దాచుకుంటాం. వ్యాపారులు చెప్పిన ధరకే ఇచ్చేస్తున్నాం.

- శాంతాటి సీతమ్మ, గుర్రాలపాలెం, లావేరు

కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

మూడు ఎకరాల్లో పంట వేశాను. పంట ప్రారంభంలో మంచి ధర ఉండేది. క్వింటా రూ.8 వేలు వరకు పలికేది. పంట చేతికొచ్చాక ధర తగ్గిపోయింది. ప్రభుత్వమే కొంటే ధర పడిపోయేది కాదు. వెంటనే కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి.

- ఎ.నర్సింగరావు, అదపాక, లావేరు

రైతుల అవసరమే ఆసరాగా...

ప్రభుత్వపరంగా జిల్లాలో పత్తి కొనుగోలు చేపట్టడం లేదు. పత్తి కొంటే తామే కొనాలి తప్ప ఎవరూ కొనే పరిస్థితి లేదని వ్యాపారులు అనుకుంటున్నారు. ఇదే అదనుగా బేరసారాలు సాగిస్తున్నారు. పత్తి నాణ్యంగా లేదని, తేమ ఉందంటూ వెళ్లిపోతున్నారు. మరోవైపు వాతావరణ పరిస్థితులు బాగాలేకపోవడం, పంటను దాచుకునే పరిస్థితి లేకపోవడంతో వ్యాపారులు ఇచ్చిన ధర తీసుకుంటున్నారు.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం

జిల్లాలో పత్తి పంట కొనుగోలుకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ)కు ప్రతిపాదనలు పంపాం. ఎచ్చెర్లలో ఏర్పాటు చేస్తే రైతులకు సౌకర్యంగా ఉంటుందని ఆగస్టులో రాశాం. పత్తి కొనుగోలుకు సిసిఐ అంగీకరిస్తే కొనుగోలుకు ఏర్పాట్లు చేస్తాం.

- ఐ.గంగాధర్,
సహాయ సంచాలకులు, మార్కెటింగ్ శాఖ

నిరసన తెలుపుతున్న వామపక్షాల నాయకులు

రాష్ట్రానికి మోడీ ద్రోహం

- ఎన్నికల హామీలు విస్మరణ
- ప్రత్యేక హోదా ప్రకటించాలి
- వామపక్ష నాయకుల డిమాండ్
- ప్రధాని పర్యటనపై నిరసన

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని, విభజన హామీలను అమలు చేస్తామని తొమ్మిదేళ్ల కిందట తిరుపతిలో వాగ్దానం చేసిన ప్రధాని నరేంద్ర మోడీ రాష్ట్రానికి తీరని ద్రోహం చేశారని వామపక్షాల నాయకులు విమర్శించారు. మాట తప్పిన మోడీ రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి ఇచ్చిన హామీలు అమలు చేయకుండా తిరుపతికి మోడీ రాకను వ్యతిరేకిస్తూ నగరంలోని అంబేద్కర్ జంక్షన్ వద్ద వామపక్షాలు ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 2014 ఏప్రిల్ 30న రాష్ట్ర విభజన తర్వాత తిరుపతి, నెల్లూరు సభల్లో ఇచ్చిన హామీలను మోడీ విస్మరించారన్నారు. తిరుమలకు వస్తున్న మోడీ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ప్రకటించాలని డిమాండ్ చేశారు. తిరుపతిలో ప్రధానిని విభజన హామీలపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిలదీయాలన్నారు.

రాష్ట్రాన్ని అదానీకి కట్టబెట్టే ప్రయత్నం

మోడీ, జగన్ కలిసి రాష్ట్రాన్ని అదానీకి కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. విద్యుత్ స్మార్ట్‌మీటర్లు, సోలార్ ఒప్పందం ఇందులో భాగమేనని చెప్పారు. గ్రీన్‌ఎనర్జీలో 58 శాతం అదానీ చేతిలో ఉందని, విద్యుత్‌పై ఆయనకు గుత్తాధిపత్యం కల్పిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో అదానీ దోపిడీని పురంధేశ్వరి ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు. మోడీ ఆదేశాల మేరకే జగన్ విద్యుత్ ఒప్పందాలు చేసుకున్నారని తెలిపారు. సోలార్ విద్యుత్ యూనిట్ రూ.2.71 ఒప్పందం చేసుకుంటున్నారని, దేశంలో ఎక్కడైనా ఇలాంటి ఒప్పందం ఉందా అని ప్రశ్నించారు. గతంలో రూ.2.48 తీసుకుంటేనే విచారణ చేయాలని కోరిన జగన్, ఇప్పుడు ఎందుకు ఇంత పెద్దఎత్తున ఒప్పందం చేసుకున్నారో చెప్పాలని ప్రశ్నించారు. ప్రతి రెండేళ్లకోసారి సోలార్ ఉత్పత్తి ఖర్చు తగ్గుతున్నా, 25 ఏళ్లకు ఒప్పందం చేసుకున్నారని తెలిపారు. సోలార్ విద్యుత్ యూనిట్ 46 పైసలకు వస్తుందని, ప్యానల్స్ ధరలు కూడా తగ్గిపోతున్నాయని చెప్పారు. ఇప్పటికే రూ.2,600 కోట్లు అదానీకి దోచిపెట్టి వినియోగదారుల నుంచి వసూలు చేస్తున్నారని విమర్శించారు.

స్మార్ట్‌మీటర్లపై విచారణ చేయాలి

స్మార్ట్‌మీటర్లు కూడా అదానీ కోసం పెడుతున్నారని తెలిపారు. ఒక్కో మీటరు (గృహావసర) రూ.14 వేల నుంచి రూ.17 వేలకు, వ్యవసాయ మీటరును రూ.37 వేలకు కొంటున్నారని, దేశంలో ఎక్కడా ఇంత ధర లేదని చెప్పారు. గృహావసర మీటరు రూ.3,500, దాని నిర్వహణకు మరో రూ.3500 అవుతోందని, అయినా రూ.14 వేలకు కొంటున్నారని తెలిపారు. రాష్ట్రంలో గృహావసర ఒక్కో కనెక్షన్‌పై రూ.10 వేలు భారం వేస్తున్నారని, వ్యవసాయ కనెక్షన్‌కు రూ.20 వేలు అదనంగా వసూలు చేస్తున్నారని అంటే రూ.20 వేల కోట్ల కుంభకోణం జరుగుతోందని తెలిపారు. వినియోగించిన విద్యుత్ కంటే అదనపు విద్యుత్‌కు బిల్లులు వసూలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. ఈ విషయంలో మోడీ, జగన్ ఆడుతున్న నాటకాన్ని బయటపెట్టాలన్నారు. స్మార్ట్‌మీటర్ల వ్యవహారంపై విచారణ చేయాలని డిమాండ్ చేశారు.

పవన్‌ను జన సైనికులు ప్రశ్నించాలి

మోడీని మూడోసారి ప్రధానిని చేయాలంటున్న జనసేన అధినేత పవన్ కళ్యాణ్, ఎందుకు చేయాలో చెప్పాలన్నారు. హోదా పాచిపోయిన లడ్డు అన్న పవన్, ఇప్పుడు వాటిని తీసుకొచ్చి వెంకన్న కాళ్ల దగ్గర పెట్టి క్షమాపణ కోరాలన్నారు. ప్రశ్నించడానికి పుట్టామని చెప్పిన పవన్, మోడీని ప్రశ్నిస్తారా, లేదో ప్రజలకు చెప్పాలన్నారు. జనసేనను ఆర్‌ఎస్‌ఎస్‌లో విలీనం చేసేలా ఉన్నారని అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్‌కు పవన్ వంతపాడడంపై జన సైనికులు పవన్‌ను ప్రశ్నించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి టి.ప్రకాష్, వామపక్షాల నాయకులు కె.మోహనరావు, జి.సింహాచలం, కె.నాగమణి, పి.తేజేశ్వరరావు, కె.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మరణిస్తూ ముగ్గురికి ప్రాణదానం

- మరో ఇద్దరి జీవితాల్లో వెలుగులు
- బ్రెయిన్ డెడ్‌తో విఆర్‌ఒ మౌనిక మృతి
- అవయవ దానానికి అంగీకరించిన తల్లిదండ్రులు
- గ్రీన్‌ఛానల్ ద్వారా తరలింపు

ప్రజాశక్తి - శ్రీకాకుళం రూరల్, అర్బన్

గ్రీన్ ఛానల్ ద్వారా తరలిస్తున్న అవయవాలు

శ్రీకాకుళం నగరంలోని నానుబాలవీధి సచివాలయంలో విఆర్‌ఒగా పనిచేసిన బొనిగి మౌనిక తాను మరణిస్తూ అవయవ దానంతో ముగ్గురికి ప్రాణం పోసింది. మరో ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపింది. నాలుగు రోజుల కిందట డేఅండ్‌నైట్ కూడలి వద్ద రోడ్డు ప్రమాదానికి గురైన ఎచ్చెర్ల మండలం కొత్తపేటకు చెందిన మౌనికను నగరంలోని ప్రభుత్వ సర్వజనాస్పత్రి, మెడికవర్, విశాఖ అపోలో ఆస్పత్రుల్లో మెరుగైన చికిత్స అందించినా కోలుకోలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఆమెను రాగోలులోని జెమ్స్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఆదివారం ఉదయం బ్రెయిన్ డెడ్ అయినట్లు నిర్ధారించిన వైద్యులు, విషయాన్ని కుటుంబసభ్యులకు తెలిపారు. బ్రెయిన్ డెడ్ కేసులో అవయవాలు దానం చేయొచ్చని, మీరిచ్చే అవయవ దానంతో మరికొంత మందికి జీవితాన్ని ఇవ్వవచ్చని జెమ్స్ ఆస్పత్రి వైద్యులు, ఎపి జీవన్‌దాన్ సమన్వయకర్తలు మృతురాలి తల్లిదండ్రులు గోవిందరావు, ఉమాదేవికి అవగాహన కల్పించారు. దు:ఖ సాగరంలో మునిగిపోయి ఉన్నా... వారు తీసుకున్న నిర్ణయం ఐదుగురి కుటుంబాల్లో వెలుగులు నింపింది. మృతురాలి గుండె, రెండు మూత్రపిండాలు, రెండు కళ్లను దానం చేయడంతో, వైద్యులు శస్త్రచికిత్స చేసిన అనంతరం వాటిని తరలించేందుకు పోలీసు సిబ్బంది ప్రత్యేక వాహనాలతో గ్రీన్ ఛానల్‌ను ఏర్పాటు చేశారు. గుండెను తిరుపతి స్విమ్స్ ఆస్పత్రికి, ఒక మూత్రపిండం విశాఖకు, మరొకటి జెమ్స్ ఆస్పత్రికి, రెండు కళ్లను రెడ్‌క్రాస్‌కు తరలించారు.

మౌనిక (ఫైల్)

మంత్రి ధర్మాన నివాళి

మౌనిక మృతిపై రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతురాలి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అవయవదానం చేసేందుకు కుటుంబ సభ్యులు ముందుకు రావడంపై కృతజ్ఞతలు తెలిపారు. ఆపద సమయంలోనూ గొప్ప స్ఫూర్తిని చాటడం ఆదర్శనీయమన్నారు. మౌనిక చనిపోయినా మరికొందరి రూపంలో జీవించి ఉంటుందని తెలిపారు.

మాట్లాడుతున్న జెడ్‌పి సిఇఒ వెంకట్రామన్

పథకాలపై ప్రజలకు అవగాహన

ప్రజాశక్తి - రణస్థలం రూరల్

కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, విధానాలకు సంబంధించి ప్రజలకు అవగాహన కల్పించడమే వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర లక్ష్యమని జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్ తెలిపారు. మండలంలోని కోటపాలెంలో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు పథకాల కింద అర్హులైనా, ఇప్పటివరకు ప్రయోజనం పొందని బలహీనవర్గాలకు అందిస్తామన్నారు. జిల్లాలోని 912 గ్రామ పంచాయతీల పరధిలో ఈ యాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి జిల్లాకు ఒక ప్రచారం వాహనం రాగా, మరో ఏడు వాహనాలు వస్తున్నాయని తెలిపారు. రోజూ రెండు గ్రామాలు చొప్పున వచ్చే ఏడాది జనవరి 26వ తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. గ్రామాల్లో వైద్య శిబిరాలను నిర్వహిస్తామని, రైతులకు డ్రోన్ల ద్వారా పురుగుమందులు, ఎరువుల పిచికారీ చేసుకునే విధానాన్ని చూపిస్తారని తెలిపారు. కార్యక్రమంలో పలువురు జిల్లా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మీ ఉత్సాహం ఆదర్శం కావాలి

- కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్
- వికలాంగుల క్రీడా పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాస్థాయిలో నిర్వహించే వికలాంగుల ఆటల పోటీల్లో పతకాలు సాధించడమే కాకుండా రాష్ట్రస్థాయిలోనూ సాధించాలని, మీ ఉత్సాహం పలువురికి ఆదర్శం కావాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని విభిన్న ప్రతిభావంతుల శాఖ ఆధ్వర్యాన నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో జిల్లాస్థాయి ఆటల పోటీలను ఆదివారం నిర్వహించారు. బాలికల పరుగు పందెంను పచ్చజెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాస్థాయిలో నిర్వహిస్తున్న పలు క్రీడల్లో పతకాలు సాధించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం వికలాంగులను ప్రోత్సహిస్తూ అనేక సంక్షేమ కార్యకమాలను అమలు చేయడమే కాకుండా జిల్లాస్థాయి ఆటల పోటీలను నిర్వహిస్తోందన్నారు. ఈ పోటీల్లో సుమారు 400 మంది వికలాంగులు పాల్గొనడం ఆనందదాయకమన్నారు. ఈ పోటీల్లో విజేతలకు డిసెంబరు 3న ప్రపంచ వికలాంగుల దినోత్సవం నాడు బహుమతి ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో మరిన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, సహాయ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, వికలాంగులు, వయోవృద్ధుల శాఖ సహాయ సంచాలకులు కె.కవిత, జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వరరావు, జిల్లా పౌర సంబంధాల అధికారి కె.బాలమాన్‌సింగ్, జిల్లా పర్యాటక అధికారి ఎన్.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

జెండా ఊపి పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

దళితులు, బిసిలకు వైసిపి అన్యాయం

టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దళితులు, బిసిలు, మైనార్టీలకు తీవ్ర అన్యాయం జరిగిందని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ విమర్శించారు. నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగున్నరేళ్ల పాలనలో 74మంది బిసిలు, 28 మంది దళితులు హత్యకు గురయ్యారని తెలిపారు. ఏడు వేల మంది బిసిలు, నాలుగు వేల మంది దళితులపై దాడులు, అక్రమ కేసులతో వేధింపులకు గురిచేసిన జగన్ ప్రభుత్వంలో బిసి, ఎస్‌సి మంత్రులమని చెప్పుకోవడం సిగ్గుచేటు అన్నారు. ఎవరిని మోసగించడానికి సామాజిక సాధికారిత యాత్రలు చేపడుతున్నారని ప్రశ్నించారు. పేరుకే బిసి మంత్రులు తప్ప పెత్తనం అంతా రెడ్లదేనని విమర్శించారు. బొత్స, ధర్మాన, తమ్మినేని, సీదిరి రెడ్ల వెనకాల పదవుల కోసం తిరుగుతున్నారని చెప్పారు. జగన్ అరాచకాలు, దోపిడీ, అత్యాచారాలను ప్రశ్నించిన మహిళా నేతలపై అసభ్యకరంగా పోస్టులు పెట్టించారని, అటువంటి సమయంలో ఈ నాయకులు ఎందుకు కళ్లు మూసుకున్నారని ప్రశ్నించారు. అసభ్యకర పోస్టులపై ఎమ్మెల్యే అదిరెడ్డి భవాని, గౌతు శిరీష, పంచుమర్తి అనురాధ పోలీసులకు ఫిర్యాదు చేస్తే రెడ్డి రాజ్యంలో పట్టించుకునే వారు కరువయ్యారని ధ్వజమెత్తారు. టిడిపి ప్రభుత్వ హయాంలో రజక, యాదవ, నాయీబ్రాహ్మణ, మత్స్యకార, గీత కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీలు ఇచ్చి ప్రోత్సహించినట్లు తెలిపారు. బిసిలకు గత ప్రభుత్వాలు ఎన్నో ఏళ్లుగా అందిస్తున్న 30 పథకాలను వైసిపి ప్రభుత్వం రద్దు చేసిందని విమర్శించారు. రాష్ట్రంలో 12 యూనివర్సిటీల్లో తొమ్మిది మంది విసి పోస్టులను రెడ్లకే కట్టబెట్టారని తెలిపారు. బిసిలు, ఎస్‌సిలు పాలనకు అర్హులు కారా అని ప్రశ్నించారు. బిసిలకు అండగా నిలుస్తున్న చంద్రబాబుపై కుట్ర చేసి జైల్లో పెట్టారని ఆరోపించారు. ఇప్పటికైనా బిసి మంత్రులు ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు జగన్‌ను ప్రశ్నించాలన్నారు. అనంతరం రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని పురస్కరించుకుని అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. సమావేశంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు పి.ఎం.జె బాబు, బొనిగి భాస్కరరావు, నాయకులు సింతు సుధాకర్, మాదారపు వెంకటేష్, ఎస్‌సి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వి రమణ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్

ట్రెజరీల్లో అక్రమాలకు తావులేదు

- సిఎఫ్ఎంఎస్ ద్వారానే చెల్లింపులు
- జీతభత్యాల చెల్లింపు అధికారం డిడిఒలదే
- ఉద్యోగులు, పెన్షనర్లకు ఇకెవైసి తప్పనిసరి
- జిల్లా ఖజానా అధికారి కె.రవికుమార్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రభుత్వ శాఖల్లో లావాదేవీల విషయంలో ట్రెజరీల ప్రమేయం ఉండబోదని, నిబంధనలకు లోబడి చెల్లింపులకు సిఫార్సులు మాత్రమే చేస్తామని జిల్లా ఖజానాశాఖ అధికారి కె.రవికుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని డీడీ కార్యాలయం మొదలు 12 సబ్‌ట్రెజరీ కార్యాలయాల్లో ఎక్కడా నేరుగా చెల్లింపులు ఉండవని స్పష్టం చేశారు. కేవలం చెల్లింపులకు సంబంధించిన బిల్లులను సరిచూసి మంజూరు చేసిన అనంతరం సిఎఫ్ఎంఎస్‌కు పంపిస్తామని వివరించారు. గతం కంటే పారదర్శంగా ఉండే ఈ విధానంలో అక్రమాలకు తావు లేదని వెల్లడించారు. పలు అంశాలపై 'ప్రజాశక్తి' ముఖాముఖిలో మాట్లాడారు.

? ఖజానా శాఖ చెల్లింపుల్లో అనేక రకాలైన ఇబ్బందులు పడాల్సి వచ్చేది. ఇప్పుడు ఈ విధానం ఎలా ఉంది?

ప్రభుత్వ ఉద్యోగుల జీతభత్యాలు మొదలు అనేకరకాల బిల్లులకు గతంలో జిల్లా స్థాయిలో జరిగే విధానం ఉండేది. నేరుగా ఖజానాకు ప్రభుత్వం నుంచి నిధులు వస్తే వాటిని ఉద్యోగుల జీతభత్యాలు, ఇతర అవసరాలు, పిఎఫ్ రుణాలు, అలవెన్సులు ఒక్కొక్కటిగా బడ్జెట్‌ను అనుసరించి ప్రాధాన్యతా క్రమంలో చెల్లించేవాళ్లం. ఆన్‌లైన్ విధానం వచ్చిన తర్వాత అంతా పారదర్శకంగా సాగుతోంది. సింగిల్ విండో విధానం వచ్చాక సిఎఫ్ఎంఎస్ విధానం ద్వారా చెల్లింపులు జరుగుతున్నాయి. ఈ విధానం వచ్చిన తర్వాత కేవలం డిడిఒ నుంచి వచ్చిన బిల్లులను సరిచూసి ఆన్‌లైన్‌లో లోపాలను సరిదిద్ది క్లియరెన్సు ఇవ్వడం మాత్రమే ట్రెజరీల బాధ్యత. డిడిఒ నుంచి బిల్లు సబ్ ట్రెజరీ అధికారికి పంపిస్తారు. అక్కడ్నుంచి ఆన్‌లైన్‌లోనే జిల్లా కార్యాలయానికి వస్తుంది. ఇక్కడ లాగిన్‌లో ఓకే చేస్తే సిఎఫ్ఎంఎస్ ద్వారా లబ్ధిదారుల ఖాతాలకు చెల్లించడం జరుగుతుంది.





? పెన్షన్ ప్రపోజల్ విధానాన్ని ఎలా అమలు చేస్తున్నారు?

ప్రతి ఉద్యోగి తన ఉద్యోగ విరమణ సమయంలో సంబంధిత శాఖ ఉన్నతాధికారుల నుంచి పెన్షన్ ప్రపోజల్‌ను పంపిస్తారు. వాటిని సబ్ ట్రెజరీలో ఎస్‌టిఒ స్థాయి అధికారి ఆథరైజ్ చేసి ప్రభుత్వానికి సమర్పించాలి. డిడిఒ నుంచి వచ్చిన ప్రతిపాదనల్లో కొన్నిసార్లు అసంపూర్తిగా ఉంటే వాటిని సరిచేసుకోవాల్సిన బాధ్యత సంబంధిత ఉద్యోగి, డిడిఒపై ఉంటుంది. సిఎఫ్ఎంఎస్ నిబంధనలకు లోబడి బిల్లులు పంపించాల్సి ఉంటుంది. వాటిని సకాలంలో పంపించకపోయినా బిల్లు పాస్ చేయడం సాధ్యం కాదు. సిఎఫ్ఎంఎస్‌లో ఆ బిల్లు అనుమతి పొందకపోవడం వల్ల చెల్లింపులు సాధ్యం కాదు. నిబంధనలకు లోబడి వాటిని పంపిస్తే పాస్ చేసేందుకు ఎటువంటి అభ్యంతరాలు ఉండవు.

? ఇకెవైసి అనుసంధాన ప్రక్రియ ఎంతమేరకు పూర్తయింది?

ప్రభుత్వ ఉద్యోగితో పాటు కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ విధానాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల ఖాతాలకు ఆధార్‌ను అనుసంధానం చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు ఉన్నాయి. జిల్లాలో 12 ఉప ఖజానా కార్యాలయాల ద్వారా పెన్షన్ తీసుకుంటున్న పింఛనుదారులకు పెన్షనర్ సిఎఫ్ఎంఎస్, ఐడి నంబర్లతో ఆధార్ నంబరును ఇకెవైసి లింక్ చేయాలని ప్రభుత్వం గతంలో ఆదేశాలు ఇచ్చింది. ఈ ప్రక్రియ దాదాపు పూర్తయింది. అనారోగ్య కారణాలతో ఉన్న వారికి ఇకెవైసి కొంత ఆలస్యమవుతోంది. అనుసంధానం చేసేందుకు ఆధార్ కార్డు, లింకు చేసిన ఫోన్, సిఎఫ్ఎంఎస్ ఐడి, పిపిఒ కాపీ, బ్యాంకు పాస్ పుస్తకం తీసుకుని వెళ్లాల్సి ఉంటుంది.

? పెన్షనర్లు వార్షిక జీవన ధ్రువీకరణ ఎప్పట్లోగా సమర్పించాలి?

పెన్షనర్ల జీవన ధ్రువీకరణ పత్రాలను ఏటా ఫిబ్రవరి 28వ తేదీ లోగా ఆన్‌లైన్ ద్వారా పంపించాల్సి ఉంటుంది. సబ్ ట్రెజరీ కార్యాలయాల్లో నేరుగా కూడా అందజేయవచ్చు. ఆన్‌లైన్‌లో సమస్యలు ఎదురైతే జీవన ధ్రువీకరణ పత్రం సబ్ ట్రెజరీలో అందజేయాలి. లేకుంటే వారికి మార్చిలో పెన్షన్ చెల్లింపునకు ఇబ్బందులు వస్తాయి.

నేడు ఎన్నికల పరిశీలకులు రాక

శ్రీకాకుళం : జిల్లాకు ఓటర్ల జాబితా పరిశీలకునిగా నియమితులైన సీనియర్ ఐఎఎస్ అధికారి జె.శ్యామలరావు సోమవారం జిల్లాకు రానున్నారు. సోమవారం జిల్లాకు చేరుకుని, 28న ఉదయం పది గంటలకు కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులతో సమావేశం కానున్నారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, తీసుకున్న చర్యలపై సమీక్ష నిర్వహించనున్నారు.

ఐక్య పోరాటాలకు సిద్ధం

ప్రజాశక్తి- కొత్తూరు

స్థానిక కళాశాల రహదారిలోని మురుగు నీరు సమస్య పరిష్కరించే వరకూ ఐక్యంగా పోరాటాలు చేస్తామని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్ ప్రభుత్వానికి హెచ్చరించారు. స్థానిక నివాస వాసులతో కలిసి ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఏడాది కాలంగా మురుగు నీరు రహదారిపై ప్రవహిస్తుండటంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక వైపు కాలువ నిర్మాణం చేసినా నీరు వెళ్ళేందుకు మార్గం ఉన్న ఆర్అండ్‌బి కల్వర్టు కొంత మంది పెత్తందారులు మూసివేయడంతో మురుగు నీరు నిల్వ ఉంటుందన్నారు. దీంతో దోమలు విజృంభించి రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులు, అధికారులు స్పందించకుంటే పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈయన వెంట పైడి రాజు, కె.శ్రీను, అప్పలరాజు, తంగుడు శ్రీను, పి.శ్రీను, వి.రాజు, వైశ్యరాజు, సాంబమూర్తి ఉన్నారు.

అవార్డును అందుకుంటున్న అనిల్

జిల్లాకు ప్రత్యేక గౌరవం

ప్రజాశక్తి- పలాస

ఢిల్లీలో ఈ నెల 24న కాన్స్టిట్యూషన్ ఆఫ్ ఇండియా క్లబ్‌లో నిర్వహించిన ఐదో ఆశ్రా కార్యక్రమంలో జిల్లాకు ప్రత్యేక గౌరవం దక్కిందని జిల్లా జాయింట్ సెక్రెటరీ జిఎంఎస్ అనిల్ రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొని ఆదివారం పలాస చేరుకున్న సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. దేశంలో 12 రాష్ట్రాలతో పాటు అమెరికా, దక్షిణ కొరియా, దుబాయ్ నుంచి ఆశ్రా ప్రతినిధులు, కేంద్ర ప్రభుత్వం తరపున ప్రత్యేక అధికారి రోహిత్ కుమార్ సింగ్ పాల్గొన్నారని అన్నారు. కన్స్యూమర్ ఎఫైర్స్, ఆశ్రా సేవలను అభినందిస్తూ తమ సహకారం ఎప్పుడూ ఉంటుందని తెలియజేశారని తెలిపారు. ఈ సందర్భంగా సినీ నటులు ఆలీ, శివారెడ్డి తదితరుల నుంచి అవార్డును అందుకున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఆశ్రా చీఫ్ హబీబ్ సుల్తాన్ అలీ, రాష్ట్ర అధ్యక్షులు ఇక్బాల్, జిల్లా అధ్యక్షులు డాక్టర్ గంజి ఆర్ ఎజ్రా, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ లఖినాన రవికుమార్, కె.పార్థసారథి పాల్గొన్నారని అన్నారు. ఈ కార్యక్ర మానికి తమ వంతు సహకారం అందించిన పశుసంవర్ధకశాఖ మంత్రి అప్పలరాజుకు, మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

అర్హులందరికీ ఓటు హక్కు

ఓటరు జాబితాను పరిశీలిస్తున్న పద్మావతి

రణస్థలం: ఓటుహక్కు ప్రాముఖ్యతను గుర్తించి అర్హులైన ప్రతిఒక్కరు ఓటుహక్కు పొందాలని ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ బి.పద్మావతి సూచించారు. యంగ్ ఓటరు ప్రత్యేక నమోదు కార్యక్రమంలో భాగంగా ఆదివారం కోష్ట పంచాయతీ పోలింగ్‌స్టేషన్ 182, 183లో ప్రత్యేక శిబిరాలను ఆమె సందర్శించారు. బూత్ లెవెల్ అధికారులు అమ్మోజీ బమ్మిడి, రాజీనాయుడులకు వచ్చిన కొత్త ఓటరు దరఖాస్తులు, డబుల్ఎంట్రీ, మరణించిన ఓటరు వివరాలపై వచ్చిన అభ్యంతరాలు పరిశీలించారు. పక్కాగా కొత్త ఓటరు నమోదు ప్రక్రియ జరగాలని సూచించారు. అనంతరం స్థానిక యువకులతో మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు కీలకమైందన్నారు. ఓటుహక్కు వినియోగంపై మరింత అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎలక్షన్ డిటి శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబు అభివృద్ధి దార్శనికుడు

ప్రజాశక్తి - ఆమదాలవలస

చంద్రబాబు నాయుడు అభివృద్ధి దార్శనికుడని టిడిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి నివగల ఢిల్లేశ్వరరావు అన్నారు. ఆదివారం మండలంలోని నిమ్మతొర్లాడ, పాతూరు గ్రామాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని టిడిపి-జనసేన ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చే ప్రజలకు అమలు చేసే ఆరు సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి నాయకులు వై ఎపి నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని చేపడుతున్నారని, జగన్ ఏమి సాధించారని ఈ రాష్ట్రానికి అవసరమో తెలియజేయాలన్నారు. జనసేన నాయకులు పోట్నూరు ప్రసాద్, గొల్లంగి సింహాచలం, టిడిపి నాయకులు బొంతు కొండయ్య, ఆకేటి రమణ పాల్గొన్నారు.

లావేరు: మండలంలోని తామాడ పంచాయతీ రాయినింగారిపేట గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటా తిరుగుతూ టిడిపి, జనసేన ఉమ్మడి మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో లావేరు మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి గొర్లె శ్రీనివాసరావు, యూనిట్ ఇన్‌ఛార్జి మజ్జి రామూర్తి, బూత్ ఇన్‌ఛార్జి గొర్లె మాధవరావు, మాజీ ఉప సర్పంచ్ గొర్లె ఆదినారాయణ, వై. రమేష్ లింగన్న పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: గ్రామాలు అభివృద్ధి చెందాలంటే టిడిపితోనే సాధ్యమని టెక్కలి నియోజకవర్గ తెలుగు యువత మహిళ అధ్యక్షులు పూజారి శైలజ అన్నారు. మండలంలోని హరిశ్చంద్రపురం పంచాయతీ విజ్జాంపాడులో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టిడిపి మినీ మేనిఫెస్టో పోస్టర్లను అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బొడ్డేపల్లి మోహన్, హనుమంతు సూర్యనారాయణ, హనుమంతు అప్పన్న, శేషగిరి, గురువెల్లి ప్రసాద్ పాల్గొన్నారు. మండలంలోని చీపుర్లపాడు, కోటబొమ్మాళి, తిలారు, సరియాపల్లి పోస్టర్లను అందజేశారు.

లావేరు : పోస్టర్లను పంపిణీ చేస్తున్న టిడిపి, జనసేన నాయకులు

నౌపడ : సంతబొమ్మాళి మండలం నౌపడ పంచాయతీలో టిడిపి నాయకులు బాబు సూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి మినీమేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ప్రభుత్వం వచ్చాక ఆయా కుటుంబాలకు అందించబోయే సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కర్రి విష్ణుమూర్తి, మహంతి రాజు, కర్రి బాలకృష్ణ, శంకర్, రోహిణిదాస్ పాల్గొన్నారు.

బిసిల వెన్ను విరుస్తున్న ప్రభుత్వం

సారవకోట : మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రమణమూర్తి

ప్రజాశక్తి- సారవకోట

వైసిపి ప్రభుత్వం వచ్చి నాలుగున్నరేళ్లలో బిసిల వెన్నువిరుస్తుందని మాజీ ఎమ్మెల్యే బొగ్గు రమణమూర్తి అన్నారు. మండలంలోని అడ్డపనస టిడిపి కార్యాలయంలో ఆదివారం విలేకరలుతో మాట్లాడారు. బిసిలకు ఒక్క మంచి కూడా చేయలేదని, దీనికి నిదర్శనం రూ.75,760 కోట్లు బిసి నిధులు దారి మళ్లించారని అన్నారు. రిజర్వేషన్‌లో 34 నుంచి 24 శాతానికి తగ్గించారని పేర్కొన్నారు. 70 వేలకు పైగా ఉన్న బిసి బ్లాక్ లాగ్ పోస్టులను భర్తీ చేయలేదని అన్నారు. బిసిల బంధవు, పేదల పెన్నిధి చంద్రబాబు నాయుడు అని అన్నారు. కార్యక్రమంలో బిసి కమిటీ అధికార రాష్ట్ర ప్రతినిధి ధర్మాన తేజ్ కుమార్, నియోజకవర్గ బిసి కమిటీ అధ్యక్షులు తాడేల బీమారావు, మండల పార్టీ అధ్యక్షులు కత్తిరి వెంకటరమణ, వెలమల రాజేంద్ర నాయుడు, సురవరపు తిరుపతి, బగ్గు గోవింద, సాధు చిన్నికృష్ణంనాయుడు, చంద్రభూషణ్ పాల్గొన్నారు.

పలాస : రాష్ట్రంలో బిసిలకు వైసిపి తీవ్ర అన్యాయం చేసిందని, ఈ ప్రభుత్వానికి మరో 90 రోజుల్లోనే సాగనంపేందుకు ప్రజలు, బిసిలు సిద్ధంగా ఉన్నారని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు అన్నారు. బాంధవుడు మన చంద్రన్న పుస్తకాన్ని ఆవిష్కరిస్తు బిసిలకు జరిగిన అన్యాయంపై తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి లొడగల కామేశ్వరరావు యాదవ్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి గాలి కృష్ణారావు, సీనియర్ కౌన్సిలర్ గురిటి సూర్యనారాయణ, నాబిలి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

కనకాచలం సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మండలంలోని తలగాం మాజీ సర్పంచ్, కామ్రేడ్ హనుమంతు కనకాచలం సేవలు చిరస్మరణీయమని కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి అన్నారు. తలగాంలో కనకాచలం 13వ వర్థంతి వేడుకలు ఆయన కుమారుడు పద్మాకర్ ఆధ్వర్యాన ఆదివారం నిర్వహించారు. ముందుగా కనకాచలం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి రమేష్, సర్పంచ్ ప్రతినిధి వెంకటేశ్వరరావు, సిపిఎం నాయకులు హనుమంతు ఈశ్వరరావు, కొల్లి ఎల్లయ్య, హనుమంతు ఉదయభాస్కరరావు పాల్గొన్నారు.

రేపు సర్పంచ్‌ల ఆత్మీయ సమ్మేళనం

గౌరీపతిరావు

ఆమదాలవలస : నియోజకవర్గ పరిధి లోని నాలుగు మండలాలకు చెందిన సర్పంచ్‌ల ఆత్మీయ సమ్మేళన సమావేశం ఈనెల 28న నిర్వహించనున్నట్లు నియోజకవర్గ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బొడ్డేపల్లి గౌరీపతిరావు తెలిపారు. పట్టణంలోని తహశీల్దార్ ఆఫీస్ రోడ్‌లో ఉన్న ఎస్ఎస్ఎన్ కళ్యాణ మండపంలో మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశం జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గొండు శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని సర్పంచులందరూ హాజరై వారి యొక్క సమస్యలను తెలియజేయాలని కోరారు.

క్విజ్ పోటీలకు స్పందన

క్విజ్ పోటీలను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

ఇచ్ఛాపురం: లయన్స్ క్లబ్ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వం బాలుర ఉన్నత పాఠశాలలో మండల స్థాయిలో హైస్కూల్ విద్యార్థులకు ఆదివారం క్విజ్, వక్తృత్వ పోటీలను ఆదివారం నిర్వహించారు. మండలంలోని 12 స్కూళ్ల నుంచి విద్యార్థులు ఈ పోటీలో పాల్గొన్నారు. క్విజ్ పోటీల్లో ప్రథమ స్థానాన్ని ఇచ్ఛాపురం బాలికల ఉన్నత పాఠశాల, ద్వితీయ, తృతీయ స్థానాలను సత్యసాయి స్కూల్, ఈదిపురం హైస్కూల్ సాధించారు. వక్తృత్వ పోటీలో ప్రథమ స్థానాన్ని కె.శాసనంకు చెందిన ఎం.కీర్తి, ద్వితీయ స్థానాన్ని ఎంపి మోడల్ స్కూల్‌కు చెందిన పి.దీపక్ గృతీయ స్థానాన్ని, ఈదుపురం హైస్కూల్‌కు చెందిన ఎన్.కుమారస్వామి కన్సోలేషన్ బహుమతి, ప్రబుత్వ బాలికల హైస్కూల్‌కు చెందిన ఎం.మౌనిక సాధించారు. కార్యక్రమానికి న్యాయనిర్ణేతలుగా కొంతాల మోహనరావు, రాజపురం బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్.వెంకటరావు వ్యవహరించారు. బహుమతులను వార్షికోత్సవ సమావేశంలో అందజస్తామని క్లబ్ అధ్యక్షులు పింటి నరసింహామూర్తి తెలియజేశారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి- ఆమదాలవలస

శ్రీకాకుళం రోడ్డు రైల్వేస్టేషన్ పరిధిలో వెంగళరావుకాలనీ రైలు పట్టాలు పక్కన గుర్తుతెలియని మహిళ మృతదేహం లభించినట్లు జిఆర్‌పి ఎస్ఐ సిహెచ్‌విఎల్ శ్రీనివాసరావు తెలిపారు. ఈమె వయస్సు 40 నుంచి 45 సంవత్సరాల మధ్యన ఉంటుందని తెలిపారు. రైలు నుంచి జారిపడి మృతిచెంది ఉండవచ్చునని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహం అక్కడ పడి ఉండడం స్థానికులు గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు అక్కడకు చేరుకొని మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

ఆర్థిక సంఘం నిధుల మళ్లింపు దుర్మార్గం

ప్రజాశక్తి- జి.సిగడాం

విజయవాడలో నిర్వహించిన గ్రామాల సమస్యలపై పంచాయతీరాజ్ ఛాంబర్, ఆంధ్రప్రదేశ్ సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రకమిటీ అఖిలపక్ష సమావేశంలో రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం కార్యదర్శి, మధుపాం సర్పంచ్ బోగాది అప్పలనాయుడు ప్రసంగించారు. ఈ సందర్భంగా కేంద్రం నుంచి వచ్చిన నిధులు సర్పంచ్‌ల ఖాతాల్లో తిరిగి జమ చేయాలని డిమాండ్ చేశారు. స్థానికంగా ఉండి సర్పంచ్ అభివృద్ధి చేయాలంటే నిధులుండాలని తెలిపారు. 14వ ఆర్థిక సంఘం, 15వ ఆర్థిక సంఘం నిధులు ప్రభుత్వం పంచాయతీల దగ్గర నుంచి కేంద్ర ప్రభుత్వ నిధులు మళ్లించి పంచాయతీల వ్యవస్థను నిర్వీర్యం చేయటం దుర్మార్గమని మండిపడ్డారు.

నగదును అందజేస్తున్న సర్పంచ్ రత్నంబాలరాజు

వైఎస్ఆర్ బీమా పేదలకు అండ

వజ్రపుకొత్తూరు : వైఎస్ఆర్ బీమా పేదలకు అండగా ఉంటుందని వైసిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి అమలపాడు సర్పంచ్ దున్న రత్నం బాలరాజు అన్నారు. ఇటీవల మృతి చెందిన దున్న దండు సత్తిరాజులు కుటుంబాన్ని ఆదివారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం మృతుని భార్య దున్న దుర్గాలు మహాలక్ష్మి వైఎస్ఆర్ బీమా తక్షణ సహాయం కింద రూ.పది వేలు నగదు అందించారు. గ్రామంలో ప్రతిఒక్కరూ వైఎస్ఆర్ బీమా తప్పకుండా నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ లింగ రాజు, వార్డు సభ్యులు దున్న ఢిల్లీరావు, సచివాలయం కన్వీనర్ కామరాజు, గృహ సారథులు పాల్గొన్నారు.

'ఎంజిఆర్'కు సన్మానం

సన్మానిస్తున్న సంఘ నాయకులు

శ్రీకాకుళం : విజయనగరం జిల్లా కేంద్రంలో తూర్పు కాపు వర్తక సంఘం ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో పాతపట్నం నియోజకవర్గ టిడిపి నాయకులు, సామాజికవేత్త మామిడి గోవిందరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తూర్పు కాపు సంక్షేమానికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని భరోసా ఇచ్చారు. అనంతరం ఎంజిఆర్‌కు దుశ్శాలువ కప్పి సన్మానించారు.కార్యక్రమంలో పల్సస్ సిఇఒ గేదెల శ్రీనుబాబు, తూర్పు కాపు పెద్దలు పాల్గొన్నారు.

ఆధార్ కార్డును పరిశీలిస్తున్న పోలీసులు

గుప్పిడిపేటలో కార్డాన్ సెర్చ్

పోలాకి: మండలంలోని గుప్పిడిపేటలో ఆదివారం ఎస్ఐ సత్యనారాయణ ఆధ్వర్యాన కార్డాన్ సెర్చ్ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఇంట్లో ఎందరు ఉన్నారు, వారి ఆధార్ కార్డులు, ద్విచక్ర వాహనాలు, వాటి కాగితాలు తదితర అంశాలను నిశితంగా పరిశీలించారు. కార్యక్రమంలో సిఐ బి.ప్రసాదరావు, 50 మంది పోలీసులు పాల్గొన్నారు.

పలువురికి ఆర్థికసాయం

కొత్తూరు : సామగ్రిని అందజేస్తున్న సభ్యులు

ప్రజాశక్తి- కవిటి

ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంలో హెల్పింగ్ హేండ్స్ అందిస్తున్న సేవలు అభినందనీయమని విశ్రాంత డిఎస్‌పి శమళ్ల వెంకట వర ప్రసాదరావు అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న కేసుపురానికి చెందిన ఇద్దరు చిన్నారులకు హెల్పింగ్ హేండ్స్ తరుపున రూ.10వేలు, శమళ్ల యూత్ తరుపున రూ.5వేలు బాధితులకు ఆదివారం ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల కాలంలో స్వచ్ఛంద సంస్థలు అవిశ్రాంతంగా పనిచేస్తున్నాయని, సామాజిక మార్పు దిశగా తమ వంతు కృషి చేస్తున్నాయని కొనియాడారు. కార్యక్రమంలో కో-ఆప్షన్ మెంబర్ పాండవ శేఖర్, హెల్పింగ్ హేండ్స్ సభ్యులు పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : మండలంలోని లక్కివలసకు చెందిన బొంగు సోమేష్‌కు హైదరాబాద్‌లో ట్రాక్టర్ ప్రమాదంలో గాయపడి విశాఖ అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వైద్య ఖర్చులకు కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో దాతల కోసం ఎదురు చూస్తున్నారు. విషయం తెలుసుకున్న మైత్రి ఫౌండేషన్ రూ.8 వేలు క్షతగాత్రుడు తల్లికి ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో గిన్ని, అప్పలరాజు, వైశ్యరాజు సీతారాం, బుడ్డెపు ఢిల్లేశ్వరరావు పాల్గొన్నారు.

కొత్తూరు : కొత్తూరుకు చెందిన బల్లు తవుడు, అమ్మన్నలకు మన భగత్ సింగ్ ట్రస్టు సభ్యులు రూ.పది వేలు నగదు, 20 కేజీల బియ్యం, రెండు నెలలకు సరిపడా నిత్యావసర వస్తువులను అందజేశారు.

ఘనంగా ఎన్‌సిసి దినోత్సవం

జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న ప్రిన్సిపాల్ సురేఖ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

దేశ సేవల్లో రక్షణ వ్యవస్థ ఎంతో కీలకమని, విద్యార్థి దశ నుంచి దేశభక్తి ప్రతిఒక్కరు అలవర్చుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ అన్నారు. ఆదివారం ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఎన్‌సిసి 75వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆమె జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఎన్‌సిసి కేడట్ల నుంచి సైనిక వందనాన్ని స్వీకరించి కవాతు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత రాజ్యాంగం ఎంతో విలువలతో కూడుకున్నదని ఆమె కొనియాడారు. దేశానికి యువత సేవలు ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎన్‌సిసి అధికారి కెప్టెన్ డాక్టర్ వై. పోలినాయుడు, ఎన్‌సిసి మహిళా కేర్‌టేకర్ వరలక్ష్మి, రసాయన శాస్త్ర అధ్యాపకులు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఎన్‌సిసి దినోత్సవాన్ని ఎన్‌సిసి విద్యార్థులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌సిసి జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరించారు. విద్యార్థులు చేసిన మార్చ్‌ఫాస్ట్ అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు టి.గణేష్, ఎన్.గణేష్, ఉమామహేశ్వరరావు, లోహిదాస్ పాల్గొన్నారు.

మధ్యప్రదేశ్ హైకోర్టు జడ్జి అరసవల్లి సందర్శన

జ్ఞాపికను స్వీకరిస్తున్న జడ్జి వెంకటరమణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్, పొందూరు

మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి దుప్పల వెంకటరమణ కుటుంబ సభ్యులతో కలసి అరసవల్లి సూర్యనారాయణ స్వామి, గార మండలం శ్రీకూర్మంలో కూర్మనాథ స్వామి ఆలయాలను ఆదివారం దర్శించుకున్నారు. అరసవల్లిలో ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆలయ సంప్రదాయాల ప్రకారం స్వాగతించారు. స్వామివారి సేవల్లో పాల్గొన్న అనంతరం న్యాయమూర్తికి అనివెట్టి మండపంలో ఆలయ ఇఒ వి.హరి సూర్యప్రకాష్ శేషవస్త్రాన్ని కప్పి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రోటోకాల్ జడ్జి కె.రాణి, వన్‌టౌన్ ఎస్ఐ బలివాడ గణేష్ పాల్గొన్నారు.

న్యాయమూర్తి స్వగ్రామమైన పొందూరు మండలం చిన్న బొడ్డేపల్లిలో గ్రామ దేవతను దర్శించుకున్నారు. సోదరులు, కుటుంబసభ్యులతో కలిసి మొక్కులు తీర్చుకున్నారు. హైకోర్టు జడ్జిని పొందూరు జూనియర్ సివిల్ జడ్జి బి.జ్యోత్స్న, ఎస్ఐ లక్ష్మణరావు, ఎంపిడిఒ ఎస్.హరిహరరావు, సర్పంచ్ రమణ తదితరులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

ఈవేమనకు సన్మానం

ఈవేమనను సన్మానిస్తున్న కవులు

ప్రజాశక్తి- రణస్థలం

ఒరిస్సా రాయఘడలో రాయఘడ రచయితల సంఘం 10వ వార్షికోత్సవ కార్యక్రమం రాజభవన్ కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి రాయఘడ సంఘం అధ్యక్షులు టివిఎల్‌ఆర్ అప్పారావు అధ్యక్షత వహించారు. శ్రీకాకుళం జెండావీధికి చెందిన ప్రసిద్ధ కవి మహ్మద్ రఫీ (ఈవేమన) ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడుతూ నేడు సాహిత్యపు విలువలు పెంచాలంటే క్షేత్రస్థాయిలో విద్యార్థులకు సాహిత్యపు విలువలు తెలపాలన్నారు. దాలినాయుడు, జిడి.చౌదరి, కార్యదర్శి బాలకృష్ణ, అప్పారావు కవిసమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో కవులు శంకరరావు, రామారావు, గౌరీ, ఆశాలత కవితలు ఆలపించారు.

నీటి సమస్యను పరిష్కరించాలి

బోరును పరిశీలిస్తున్న జనసేన నాయకులు

లావేరు : మండలంలో చిగురుకొత్తపల్లి గ్రామంలో దీర్ఘకాలికంగా నెలకొన్న తాగునీటి సమస్యను ప్రభుత్వం వారం రోజుల్లో పరిష్కరించకపోతే జనసేన పార్టీ పరిష్కరించి గ్రామానికి తాగునీరు సదుపాయం కల్పిస్తుందని జనసేన ఎచ్చెర్ల నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడు డాక్టర్ విశ్వక్షేన్ అన్నారు. చిగురుకొత్తపల్లి గ్రామంలో సమస్యను ప్రజలు ఆయన దృష్టికి తీసుకువెళ్లడంతో ఆదివారం పాడైన బోర్‌ను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి వారం రోజుల్లో తాగునీటి సమస్య పరిష్కారం చెయ్యకపోతే తామే పరిష్కరించి గ్రామ ప్రజలకు తాగునీరు అందిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జనసేన నాయకులు సత్యా నీలకంఠం, వడ్డాది శ్రీనివాసరావు, కాకర్ల బాబాజీ దొర, రాజారమేష్ నాయుడు, సూర్య ఉన్నారు.

కానరాని పిక్నిక్ సందడి

అవగాహన కల్పిస్తున్న మెరైన్ పోలీసులు

నౌపడ: సంతబొమ్మాళి మండలం భావనపాడు సముద్ర తీరంలో కార్తీకమాసం రెండో ఆదివారం పర్యాటకులు రాక రాకపోవడంతో తీరం వెలవెల బోయింది. వేలాది మందితో కిక్కిరిసి కనిపించే తీరం పదుల సంఖ్యలో పర్యాటకులతో కనిపించింది. కార్తీకమాసం అందులోనూ ఆదివారం వచ్చిందంటే సుదూర ప్రాంతాల నుంచి వివిధ విద్యాసంస్థల నుంచి బస్సుల ద్వారా విద్యార్థులు, పిల్లలు పర్యటకులు పెద్ద ఎత్తున వస్తుంటారు. కానీ, ఆదివారం పర్యాటకులు పెద్దగా రాకపోవడంతో పిక్నిక్ సందడి కనిపించలేదు. మొదటి ఆదివారం క్రికెట్ వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్‌తో పిక్నిక్‌కి పర్యాటకులు ఆసక్తి చూపలేదు. ఈ వారం కార్తీక పౌర్ణమి కావడంతో మాంసాహారులు పిక్నిక్ వెళ్లేందుకు ఆసక్తి చూపలేదని తెలుస్తోంది. పర్యాటకులకు భావనపాడు మెరైన్ పోలీసులు సముద్రంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు.

ఆమదాలవలస : విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న స్పీకర్ సీతారాం


శ్రీకాకుళం అర్బన్ : నివాళ్లర్పిస్తున్న మంత్రి ప్రసాదరావు

ఇచ్ఛాపురంలో జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

రణస్థలంలో ఎమ్మెల్యే కిరణ్‌కుమార్...

ఘనంగా రాజ్యాంగ ఆమోద దినోత్సవం

జిల్లా కేంద్రంతో పాటు మండల కేంద్రాల్లో, సచివాలయాల వద్ద రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. నాయకులు, అధికారులు అంబేద్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఎల్లవేళలా రాజ్యాంగ స్ఫూర్తిని చాటుదామని పిలుపునిచ్చారు. అంబేద్కర్ సారథిగా ఏర్పాటైన డ్రాఫ్టింగ్ కమిటీ భిన్నత్వ సమ్మేళతమై దేశానికి రాజ్యాంగాన్ని రూపొందించడంలో ఎంతగానో శ్రమించారన్నారు. అంబేద్కర్ స్ఫూర్తితో ఆయన ఆశయాలకు అనుగుణంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అడుగులు వేస్తున్నాన్నారు. శ్రీకాకుళం రూరల్ మండలం పెద్దపాడులోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అంబేద్కర్ చిత్రపటానికి, ఆమదాలవలస మండలం ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద విగ్రహానికి శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం, ఇచ్ఛాపురంలో విగ్రహానికి జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, కలెక్టరేట్ సమావేశ మందిరంలో చిత్రపటానికి జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, డిఎంహెచ్‌ఒ డాక్టర్ బి.మీనాక్షి, రాజీవ్ గాంధీ యూనివర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకటగోపాల ధన బాలాజీలు విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేశారు.

- ప్రజాశక్తి, జిల్లా విలేకరుల యంత్రాంగం

కవిటిలో...

నందిగాంలో...

మెళియాపుట్టిలో జనసేన నాయకులు...

టెక్కలిలో...

సోంపేటలో...

కలెక్టరేట్‌లో...

కొత్తూరులో...

పొందూరులో...

కోటబొమ్మాళిలో...

రణస్థలం రూరల్ : పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న 'ఎంజిఆర్'

సంతబొమ్మాళిలో...